
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**APRIL - 2017**

సంవత్సర చందా రూ. 50/-



# క్రీస్తు సంఘములు నిర్వహించు

# రక్షణ సువార్త సభలు

తేదీలు : 2017 మే నెల 10, 11, 12 తేదీలలో
బుధ, గురు, శుక్రవారములు
ప్రతి సాయంత్రం 6.00 గం॥ల నుండి

స్థలము : మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో, కాకినాడ.

ప్రసంగీకులు : అనుభవజ్ఞులైన స్వదేశీ సువార్తికులు
వాక్యపరిచర్య చేయుదురు

మీరు, మీ బంధుమిత్రులు, స్థానిక సంఘము ప్రార్థన పూర్వకముగా రండి. దైవాశీస్సులు మెండుగా పొందండి. వివరములకు ఈ దిగువ నెంబర్లకు ఫోన్ చేయండి.

98665 28791/9963186457/98669 03278

నిర్వాహకులు : సహో. కె. మోజెస్
యస్. ప్రభాకర్
అబ్రాహాం లింకన్ మరియు
పి. బలరామ్ గార్లు

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 38 ఏప్రిల్- 2017 సంచిక -9


## మనుష్యులు ప్రార్థించవలెను

**( "Men ought to Pray..." )**

బైబిలులో మనము కనుగొను దైవజనులు ప్రార్థనా పరులు. దానియేలు, ఎజ్రా, నెహెమ్యా, మోషే, దావీదు, పౌలు, పేతురు మొదలగు వారు, ప్రార్థించుట ఎన్నడు మరువని వారు. దేవుడున్నాడనియు, తన సేవకుల ప్రార్థనల నాలకించి ప్రత్యుత్తరమిచ్చు వాడనియు వారు నమ్మిరి. తమ శోధనలను గూర్చి, బాధలను గూర్చివారు తరచు దేవునికి తెలియజేసు కొనుచుండిరి. మానవుని సమస్తాశీర్వాదములకు దేవుడే ఆధారభూతుడని వారెన్నడు మరువలేదు. మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెనని యేసుబోధించెను (లూకా 18:1). కొందరు వారికి అదీ యిదీ లేదని సణుగు కొందురు, గాని దేవుని అడుగుట మరచిపోవుదురు.

మన ప్రభువైన యేసు ఈ లోకములో యున్నపుడు పురుషులు, స్త్రీలు వారి బాధలను ప్రభువునొద్దకు తెచ్చిరి. అందువలన ఒక కుమార్తె బాగు చేయబడెను. ఒక కుమారుడు బ్రదికింపబడెను లేదా ఒక దయ్యము వెళ్ళగొట్టబడెను. మన ప్రభువునందు నేడు మనము అట్టి విశ్వాసము నెందుకు కలిగి యుండలేము ?

మనము ఆరాధనకు కూడు కొనునప్పుడు ప్రార్థన ఆరాధనలో ఒక

భాగము మాత్రమే కాదు, ప్రతి క్రైస్తవుని దైనిక జీవితములోను ప్రార్థన అతి ప్రాముఖ్యమై యుండవలెను. మన ప్రతి దిన సమస్యలు అవి శోధనలేమి, కాకపోనేమి వాటిని మన దేవుని యొద్దకు ప్రతి దినము ప్రార్థన ద్వారా తీసికొని వెళ్ళవలెను. మనము చేయు ప్రతి పనిలోను, అది సరియైనదయితే ప్రభువు మనకు సహాయకారుడై యుండును. నీ పనిలోని గాని, చదువులో గాని, వ్యాపారమందేమి దేవుని సహాయమును నీవెందుకు అభ్యర్థించరాదు? ఒక క్రైస్తవ డాక్టరు ఆపరేషన్ చేయకముందు దేవుని సహాయము నభ్యర్థించుట వింత కానేకాదు. పౌలుతో సహా ప్రయాణము చేసిన వైద్యుడగు లూకా ప్రార్థనా పరుడనుటను ఎవరు శంకించరు. ప్రార్థన ప్రతి క్రైస్తవుని జీవితములోను అత్యవసరమైన దినచర్యగా యుండవలెను.

భవిష్యత్తు పై ఖచ్చితముగా ఆధారపడలేని దినములలో మనము జీవించుచున్నాము. భావిలో మనకు గాని, మన ప్రియులకు గాని ఏమి సంభవించ బోవుచున్నదో మనము ఎరుగము. అయితే దానిని గూర్చి మనమేమి చేయగలము? నిన్ను ఏ మాత్రము విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని చెప్పిన దేవునికి ఎల్లప్పుడు ప్రార్థన చేయవలెను. “నీతి మంతుని విజ్ఞాపన మన:పూర్వకమైనదై బహుబలముగలదై యుండును. ఏలియా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సరముల వరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థన చేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలమిచ్చెను (యాకోబు 5:16-18). ఏలియా దేవుడే మన దేవుడు. ఏలియాకు జవాబిచ్చిన దేవుడు మన ప్రార్థనలకు కూడ జవాబిచ్చును. ఆయన చిత్తమును మన యెడల జరిగించుటలో ఆయన అద్భుతము లను చేయనవసరము లేదు. ప్రకృతి ద్వారానే ఆయన మన అవసరములను తీర్చగలరు.

ఒక నదీతీరమున ఉన్న స్త్రీ యొక్క ప్రార్థనలను దేవుడాలకించిన సంఘటనను మనము అపొ.కా. 16వ అధ్యాయములో చదువగలము. పౌలును అతనితో కూడ నున్న సువార్తికులును ఆసియకును, బితూనియకును వెళ్ళుటకు ప్రయత్నము చేసిరి గాని యేసుయొక్క

వారు ముసియను దాటిపోయి త్రోయకు వచ్చిరి. అప్పుడు పౌలుకు కలిగిన దర్శనమును బట్టి వారు మాసిదోనియకు బయలుదేరిరి. వారు ఓడయెక్కి ఫిలిప్పీకి వచ్చిరి. మాసిదోనియ దేశములో ఆ ప్రాంతమునకు అది ముఖ్య పట్టణమును, రోమీయుల ప్రవాస స్థానమునై యున్నది. విశ్రాంతి దినమున వారు గవిని దాటి నదీతీరమున ప్రార్థన జరుగు ఒక చోటికి వచ్చి అక్కడ కూడివచ్చిన స్త్రీలకు సువార్త బోధించిరి. అందులో లూదియ అను దైవభక్తిగల ఒక స్త్రీ పౌలు చెప్పిన మాటలయందు లక్ష్య ముంచి ఆమెయు ఆమె యింటివారును బాప్తిస్మము పొందిరి. ఈ సంఘటనను మీరు అపొ.కా. 16:6-15లో చదువ గలరు. దీని యంతటిలో సువార్తికులను వినువారితో సమకూర్చు దేవుని హస్తమును మనము చూడగలుగు చున్నాము. దేవుడు ఈ స్త్రీల యొక్క ప్రార్థన నాలకించెను.

ఇటలీ పటాలములో శతాధిపతి యైన కొర్నేలీ విషయములో కూడ, సువార్తికుడైన పేతురును అతనితో కలుపుటలో దేవుని ఆశ్చర్య హస్తమును మనము చూడగలుగుచున్నాము. అట్లే సువార్తికుడైన ఫిలిప్పునపుంసకుని రథముతో కలసి కొనుటకూడను, వీరందరి సందర్భములోను దేవుడు వారి ప్రార్థనల నాలకించెనని మనకు విశద మగుచున్నది. రక్షణ సువార్తను పరిశుద్ధాత్ముడు వారికి అద్భుతరీతిగ బోధించలేదు గాని, ఆ రక్షణ వార్తను వారు వినగల్గునట్లు, సువార్తకు వారు లోబడగల్గునట్లు వారిని, సువార్తికులను పరిశుద్ధాత్ముడు ఆశ్చర్యముగ సమావేశపరచెను. అవును, దేవుడు తన సేవకుల మొరల నాలకించి ప్రత్యుత్తర మిచ్చువాడై యున్నాడు. దేవుడు అలనాడు తనయందు భక్తిగలవారి ప్రార్థనల నాలకించిన యెడల నేడు మన ప్రార్థనల నాలకించరా?

ఒకవేళ మన ధనమును గూర్చి, విద్యను గూర్చి, అందమైనభవనము లను గూర్చి, సాంధించిన కార్యము లను గూర్చి మనము అతిశయ పడుచున్నామేమో, అయితే నేడు మనకవసరమైనవి అవికాదు. మనకవసరమైన శక్తిఅంతయు ఈలోక సుఖసంపదలలో యున్న యెడల నిజానికి నాశనప్రాతులమే! అయితే ప్రార్థనలో శక్తియున్నది. ఆశక్తి నేడు మనకవుసరమై యున్నది.

మనకు స్వాతంత్ర్యము, శాంతి, సమాధానముల నొసగు నిమిత్తము మనదేశపు సైనికలమీదను, మరణా యుధముల మీదను, యుద్ధ నౌకల మీదను ఆధారపడి యుందుమా? లేదా వీటన్నిటిని మనకు ఉచితముగా అను గ్రహించగల దేవునియందు నమ్మిక యుంచుదమా? నిజానికి ఒక దేశపు బలము దానికున్న యుద్ధోపకరణముల పై కాదుగాని ఆ దేశమందలి నీతిమంతుల మీదను, వారి ప్రార్థనల మీదను ఆధారపడి యున్నది. అట్లే సంఘము యొక్క బలము అంతయు దాని సభ్యులకున్న విద్య, వెండి బంగారములపై లేదుగాని అందున్న నీతిమంతుల జీవితము మీదను, వారి త్యాగముమీదను, వారి ప్రార్థనల మీదను ఆధారపడియున్నది. అందుకే క్రైస్తవులు సంపూర్ణ భక్తియు, మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యు లందరి కొరకును, రాజుల కొరకును, అధికారులందరి కొరకును విజ్ఞాపన ములను ప్రార్థనలును యాచనలను కృతజ్ఞతాస్తుతులను చేయవలెనని పరిశుద్ధాత్ముని ద్వారా హెచ్చరింప బడియున్నారు (1తిమోతి 2:1-2).

"యెహోవా దృష్టి నీతిమంతుల మీదనున్నది. ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గియున్నవి. దుష్క్రియలు చేయు వారి జ్ఞాపకమును భూమి మీద నుండి కొట్టివేయుటకై యెహోవా సన్నిధి వారికి విరోధముగా నున్నది. నీతిమంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును... విరిగిన హృదయము గలవారికి యెహోవా ఆసన్నుడు. నలిగిన మనస్సుగలవారిని ఆయన రక్షించును" అని దైవ వేదము బోధించు చున్నది (కీర్తన 34:15-18).

దేవుని దృష్టిలో నీవు నీతి మంతుడవు కావలెనంటే ఆయనచే రక్షింప బడవలెనంటే క్రీస్తునందు విశ్వాస ముంచుము. నీ పాపముల విషయమై మారు మనస్సు బొందుము. ప్రభువు నామమును మనుష్యుల యెదుట ఒప్పు కొనుము. పాప క్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందుము. ఆయన నీ గత పాపములనన్నింటిని కడిగి, నిన్ను పవిత్రుని జేసి పరిశుద్ధాత్మ అను వరమును నీ కనుగ్రహించును. అప్పటి నుండి ఆయనను ప్రార్థించి ప్రతిఫలమును పొందుము.

# అన్యభాషల ప్రయోజనము
## (The Purpose of Tongues)

మొదటి శతాబ్ధపు సంఘమునకు దేవుడు విదేశీ భాషలను మాట్లాడే పరిశుద్ధాత్మ వరాన్ని అనుగ్రహించారు. ఆభాష వారు యిదివరలో నేర్చుకొన్నట్టిది కాదు. వేరే భాష గనుక అన్యభాషయని చెప్పబడినది. గాని ఆభాషను ఎరిగిన వారున్నట్లయితే వారికది అర్ధమయ్యే భాష. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన అపొస్తులులందరు అన్యభాషలతో మాట్లాడసాగిరి. గాని జనసమూహములో యున్న "ప్రతి మనుష్యుడు తన స్వభాషతో వారు మాటలాడుట మనము వినుచున్నామే;... వీరు మన భాషలతో దేవుని గొప్ప కార్యములు వివరించుట వినుచున్నామని చెప్పుకొనిరి" (అపో.కా 2:5-12).

మొదటి శతాబ్ధపు సంఘమునకనుగ్రహింపబడిన అన్యభాషల వరమునకు మూడు ప్రయోజనములు కలవు, ఆ ప్రయోజనములు నెరవేరగానే, అద్భుతరీతిగా అన్యభాషలలో మాటలాడే వరము నిలిచిపోయెను.

అన్యభాషలు ఒక సూచక క్రియ :

విదేశీ (అన్య) భాషలతో మాటలాడుట పరిశుద్ధాత్ముడు అనుగ్రహించిన అద్భుత వరము. నమ్మిన వారి వలన సూచక క్రియలు కనబడునని యేసు తన అపొస్తులులకు వాగ్ధానము చేసారు (మార్కు 16:1). ఆదిమ శిష్యులు "బయలుదేరి వాక్యమంతటా ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచకక్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను" (మార్కు 16:20). "దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియల చేతను, మహత్కార్యములచేతను, నానా విధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్యమిచ్చు చుండగా వినిన వారిచేత (వాక్యము) మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:4).

క్రైస్తవ్యము దేవుని వలన కలిగినదని యితరులు నమ్ముటకు అన్యభాషలు మొదలైన యితర అద్భుత వరములు సూచనగా ఇయ్యబడెను.

ఒకడు యిదివరలో ఎన్నడు నేర్చుకొనని వేరే భాషలో మాట్లాడు నప్పుడది అవిశ్వాసులకు ఒక సూచనగా యుండాలని దేవుడు కోరెను. "కాబట్టి భాషలు విశ్వాసులకు కాదు, అవిశ్వాసులకే సూచకమై యున్నది" (1కొరింథీ 14:22). దేవుడు సంఘములో అద్భుతరీతిగా పనిచేయు చున్నారని తెలియజేయుటకు అన్యభాషలు బహిరంగ ప్రదర్శనయై యుండెను. అవిశ్వాసులు తామెరిగిన మిత్రులు మున్నెన్నడు నేర్చుకొనని ఇంకొక భాషతో మాటలాడుటచూచారు. అందువలన విశ్వాసులైన వారితో దేవుడున్నాడని నిరూపించుటకు అవిశ్వాసులకు భాషలు ఒక సూచనయై యుండెను.

**క్షేమాభివృద్ధి కలుగ జేయుటకు భాషలు ఇయ్యబడెను :**

"భాషతో మాటలాడువాడు తనకే క్షేమాభివృద్ధి కలుగజేసికొనును" (1కొరింథీ 14:4). ఒకడు వేరే భాషతో మాట్లాడుచుండగా దాని భావార్థము (అనువాదము) చెప్పువాడు లేనియెడల, భాషమాటలాడు వాడే క్షేమాభివృద్ధి నొందును. భావార్థము చెప్పువాడు లేని సందర్భాన్ని గూర్చి 1కొరింథీ 14:4లో చెప్పబడెను. అట్టి సందర్భాల్లో భాషతో మాటాలాడు వాడు మౌనముగా యుండాలని పౌలు హెచ్చరించాడు, ఏలయనగా ఒకడు అన్యభాషతో మాట్లాడితే తనకు క్షేమాభివృద్ధి కలుగ జేసికొనునుగాని, కూడివచ్చిన వారికతడు ఇబ్బంది కలుగజేయును. అయితే తర్జుమాదారుడున్నట్లయితే సంఘమంతా ఉపదేశము (క్షేమాభివృద్ధి) పొందును.

**సువార్త వ్యాప్తి కొరకు భాషలు ఉపయోగపడెను :**

ఆదిమ క్రీస్తు సంఘాల్లో వివిధ భాషల వారుండటయే గాక, వారు సర్వలోకానికి వెళ్ళి సర్వ జివాంగము లకు సువార్త ప్రకటించాలని ఆజ్ఞాపించ బడిరి (మత్తయి 28:19-20). ఏదైనా కొత్త ప్రాంతపు భాషలో బోధించాలన్నా ఉపదేశించాలన్నా, ఆ ప్రాంత భాష నేర్చుకొనుటకు 6 నెలలు నుండి ఒక సంవత్సర కాలము పట్టును. ఏ ప్రాంతము వెళ్ళినా పౌలు అక్కడ అంతకాలం వుండి ఆ భాష నేర్చుకొనుటకు అతనికి వీలుపడిందా? అట్టి సమయం అతను వెచ్చించ గలడా? "నేను మీ యందరి కంటె ఎక్కువగా భాషతో మాటలాడు

చున్నాను; అందుకు దేవుని స్తుతించు చున్నని" అతడు వ్రాసాడు (1కొరింథీ 14:18).

పరిశుద్ధాత్మవలన అతడు నేర్చుకొనని అనేక భాషలతో మాటలాడే వరాన్ని పౌలు పొందాడు. అట్టి అద్భుత వరము వలన అతడును, మిగతా సువార్తికులును మొదటి శతాబ్ధములోనే ప్రపంచమంతా సువార్తచాటుటకు వీలు పడింది. యేసు వారికాజ్ఞాపించిన దానిన నెరవేర్చు నిమిత్తము వారు సర్వలోకానికి వెళ్ళిరి. ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి అన్యభాషల వరము వలన వారు సువార్త ప్రకటింప గలిగిరి (కొలస్స 1:23).

**అన్యభాషలు నిలిచిపోయెను :**

దేవుని వాక్యమును స్థిరపరచుటకు గాను మొదటి శతాబ్ధములో ఇయ్యబడిన అద్భుత వరములు, అన్యభాషలతో సహా అన్నియును నిలిచిపోయెనని క్రొత్త నిబంధన బోధించు చున్నది. ఆదిమ క్రైస్తవులను విశ్వాసములో బలపరచుటకును, వాక్యమును స్థిరపరచుటకును విదేశీ భాషలు మాటలాడే అద్భుత వరము వారికనుగ్రహించబడెను (మార్కు 16:17-20; హెబ్రీ 2:3; ఎఫెసీ 4:11,16). అపొస్తులులు వలన ఆదిమ శిష్యుల వలన ప్రకటింపబడిన వాక్యము పరిశుద్ధాత్మ శక్తి వలన స్థిరపరచబడెను (యోహాను20:30; 1కొరింథీ 4:19,20, 1థెస్స 1:5). పౌలు ప్రకటించినది, సువార్తికులు, ప్రవక్తలు ప్రవచించినది కూడ అద్భుతముల వలన దృఢపరచబడెను (రోమా 15:18-19). అయితే క్రొత్త నిబంధన గ్రంధము లిఖిత పూర్వకముగా ముగించబడినప్పుడు అద్భుత వరములన్ని నిలిచిపోయాయి.

అద్భుతముల ద్వారా విశ్వాసాన్ని స్థిరపరచవలసిన అవసరం ఈనాడు యేమీలేదు. మొదటి శతాబ్ధపు అనేక అద్భుతములు అందుకొరకు క్రొత్త నిబంధనలో రికార్డు చేయబడివున్నాయి (యోహాను 20:30,31). అద్భుతముల ద్వారా స్థిరపరచబడిన వాక్యము యొక్క రికార్డు క్రొత్త నిబంధన నేడు మనకున్నది. యేసుయొక్క అనేక అద్భుతములను యోహాను రికార్డు చేసాడు. అన్నియుగాలలో యున్న జనులందరికి విశ్వాసము కలుగ జేయుటకు వాటిని రికార్డు చేసాడు. అన్ని యుగాలలో యున్న జనులందరికి విశ్వాసము కలుగజేయుటకు ఆ రికార్డు

చాలని అతడు వక్కాణించాడు (యోహాను 20:30,31). అందువలన అన్యభాషల వరము లేకుండా నేడు యేసునందు జనులు విశ్వాసముంచ గలరు. తన గ్రంథములో ఏమైతే రికార్డు చేయబడిందో అది మనలను ప్రతి సత్కార్యము చేయుటకు పరిపూర్ణ మైయున్నదని దేవుడు చెబుతున్నారు (2తిమోతి 3:17).

అద్భుత రీతిగా కలుగు వాక్య బయల్పాటు ఆపుచేయబడునని దేవుడు జెకర్యా ప్రవక్త ద్వారా తెలియజేసారు (జెకర్యా 13:2-5). అదెప్పుడు జరుగునో జెకర్యా చెప్పలేదుగాని ఆగిపోవునని మాత్రం తెలియజేసాడు. 1కొరింధీ 13:8-10లో ఈ అద్భుత వరములు నిలిచిపోవును, నిరర్ధకము లగును, ఆగిపోవునని పౌలు తెలియ జేసాడు, ఎఫెసీ 4లో కూడ అతడట్లు బోధించాడు.

విశ్వాసము సంపూర్తిగా బయలు పరచబడు వరకు అద్భుత వరములుంటాయని పౌలు ఎఫెసీ 4లో చెప్పాడు. "అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులననుగ్రహించెను" అని వ్రాయబడియున్నది (ఎఫెసీ 4:9). యేసు పరలోకమునకారోహణమైనప్పుడు ఆయన మనుష్యులకు అద్భుత వరములనిచ్చెను. "ఈ వరములు పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి జెందుటకు ఇయ్యబడెను (ఎఫెసీ 4:12). "మనమందరము విశ్వాసములో ఏకత్వము పొంది సంపూర్ణ పురుషుల మగువరకు ఆయన ఈలాగు నియమించెను' (11వ). ఇంకొక మాటలో సంఘమునకు విశ్వాసము వాక్యము సంపూర్ణముగా బయల్పడు వరకు ఈ అద్భుత వరములు నియమించబడెను. ఈ విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింప బడెనని యూదా వ్రాసాడు (యూదా : 3; రోమా 10:8; కొలస్స 3:7). అందు వలన అన్యభాషలతో మాటలాడుటతో సహా, అద్భుత వరములన్నీ ఆగిపోయాయి. దేవుని బయల్పాటు అంతా మొదటి శతాబ్ధములోనే సంపూర్తి అయెను. సత్యవాక్యము సంపూర్తిగా క్రొత్త నిబంధనలో రికార్డు చేయబడెను. గనుక అద్భుతములు ఆగిపోయాయి, భాషలు కూడ నిలిచిపోయాయి.

-రోజర్ డిక్సన్

# మేము మనుష్యులను ప్రేరేపించుచున్నాము
## (We Persuade men)

"కావున మేము ప్రభువు విషయమైన భయమునెరిగి మనుష్యులను ప్రేరేపించుచున్నాము" అని అపో.పౌలు చెప్పాడు (2 కొరింథీ 5:11). రాబోవుచున్న తీర్పు ఖచ్చితం. "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10). బైబిలునందలి గొప్పవ్యక్తులకు రాబోవు చున్న తీర్పును గూర్చి తెలియజేస్తే వారు ఎట్లు స్పందించియుందురు?

– హనోకు దానిని నమ్మియుండును.

– నోవహు శకించి యుండడు.

–అబ్రాహాము తక్షణమే దాని కొరకు సిద్ధపడియుండును.

– ఆవర్తమానము తెలియ జేయుటకు మోషే ఇశ్రాయేలీయుల నందరినీ సమావేశపరచి యుండును.

– యెషయా, యిర్మియాలు ప్రజలను హెచ్చరించి యుందురు.

– ఏలియా ఎలీషాలు యింటిపై కప్పుల నుండి దానిని గూర్చి ప్రకటించి యుందురు.

– మత్తయి, మార్కు, లూకా, యోహాను, పేతురు, పౌలు, యాకోబు, యూదాలు దాని యదార్థతను గూర్చిన ఋజువులను మనకు సమర్పించి యుందురు.

గొర్రెపిల్ల జీవగ్రంథములో నీపేరు లిఖించబడియుండని యెడల నీవు యేసుప్రభువు నందు విశ్వాసముంచి పాపముల విషయమై మారుమనస్సునొంది, ఆయన నామమును ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని నిన్ను ప్రేరేపించు చున్నాను (గలతీ 3:26-27; అపో.కా. 2:38; 8:35-40).

నీ పేరు జీవగ్రంథమందు వ్రాయబడియున్న యెడల అదెన్నడు తుడిచివేయబడకుండునట్లు నీ శేష జీవితమును జీవించవలెనని నిన్ను ప్రేరేపించుచున్నాను (ప్రకటన 2:10).

– హెచ్ టు హెచ్

# ఆయన ప్రత్యక్షమైనప్పుడు

## (When He appears)

ఆదిమ క్రైస్తవులకు క్రీస్తు యొక్క రెండవరాకడ వివాదాంశము కానేకాదు. దానిని వారు ఆశతో ఆపేక్షించు చుండిరి. "మన పౌరస్థితి పరలోకమందున్నది, అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టు కొనియున్నాము" అని ఫిలిప్పీ 3:20 చెప్పుచున్నది. మరియు "మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము" (రోమా 8:23), మీరు "దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో ఆపేక్షించుచు మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్త గలవారై యుండవలెను" అని పేతురు చెప్పుచున్నాడు (2పేతురు 3:11,12). ఈ లేఖనముల వలన ఆదిమ క్రైస్తవులు క్రీస్తుయొక్క రెండవ రాకడ కొరకు ఆశతో, ఆశక్తితో ఎదురు చూచుచుండిరని గ్రహింపగుచున్నది.

"ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలి యుందుమని యెరుగుదుము. ఆయన యందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్ర పరచుకొనునని భక్తుడైన యోహాను వ్రాసాడు (1యోహాను 2:2,3). క్రీస్తు యొక్క రెండవ రాకడయందున్న విశ్వాసము క్రైస్తవ జీవితము జీవించుటకు శక్తిననుగ్రహించును.

**అది ఉత్సాహమునిచ్చును:** బహుమానము నందిపుచ్చుకొనుటకు అది తగిన ప్రోత్సాహమిచ్చును. ఆయన వచ్చుసరికి సిద్ధముగా యుండుట కంటే లాభకరమైనది ఇంకేమి యున్నది? ప్రతివాని పని ఆ దినము దానిని తేటపరచును (1కొరింథీ 3:13-14). "భళా నమ్మకమైన మంచిదాసుడా నీ యజమాని సంతోషములో ప్రవేశించుము" అను మాటలు వినుట కంటే శ్రేష్టమైనది ఇంకేమున్నది? (మత్తయి 25:23).

**అది బాధ్యతను సంకల్పించును:** మన పరిచర్య విషయమై మనము బాధ్యులము. "మేము మీ మధ్యను నెరవేర్చిన కార్యములను చెడగొట్టు

కొనక మీరు పూర్ణ ఫలము పొందునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" యని 2 యోహాను 8లో చెప్పబడియున్నది. "నాతోడు ప్రతి మోకాలును నా యెదుట వంగును, ప్రతినాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు అని వ్రాయబడి యున్నది. గనుక మనలో ప్రతివాడు తన్ను గూర్చి లెక్క యొప్పగింపవలెను" (రోమా 14:11-12).

అది భద్రతననుగ్రహించును భవిష్యత్తును గూర్చి మనము ఆందోళన చెందనవసరం లేదు, భయపడ నవసరం లేదు. "నేను మరల వత్తును" అని యేసు చెప్పారు (యోహాను 14:3). అది మన నిరీక్షణ ధైర్యము, భద్రత. మనం క్రీస్తుకు చెందినవారము ఆయన మన కొరకు వచ్చుచున్నారు! ఈ లోకములో భద్రతలేదు, మన స్వాస్థ్యము ఇక్కడలేదు. అక్షయ మైనదియు, వాడ బారనిదియు, నిష్కళంకమైనదియునైనది మన కొరకు పరలోకంలో దాచబడియున్నది (1 పేతురు 1:41). అదే మన శుభప్రదమైనది నిరీక్షణ. ఈ నిరీక్షణను సజీవముగా యుంచుడి!

-క్లేరెన్స్ డిలోచ


## ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు

**మీ యింటిలోనే యుండి బైబిలును చదవి సత్యమును గ్రహించండి. యితరులకు సత్యమును బోధించండి. మేమిచ్చు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఒక బైబిలును ఉచితముగా పొందండి. ఈరోజే మాకు వ్రాయండి.**

**సత్యవాణి**
పోస్ట్‌బాక్స్ నెం. 80
కాకినాడ - 533 001.

# జయించు వానికి
## (To him that overcomes )

ఆసియాలోని ఏడు సంఘము లకు వ్రాయబడిన ప్రతి ఉత్తరము జయించు వానికి వాగ్దానములతో ముగించబడెను. జయించుటను గూర్చి ఇయ్యబడిన హెచ్చరికలలో మనకు అమూల్యమైన పాఠములున్నవి.

"జయించుట" అనగా పోరాటములో జయించుట, ఓడించుట, ఆదిపత్యము సాధించుట, విజయం సాధించుటయని అర్ధము. మనం అబద్ధబోధకులను, ఈలోకాన్ని, శోధనలను, స్వార్ధాన్ని జయించాలి. క్రైస్తవ జీవితము తేలికయైనది కాదు. దానిలో శ్రద్ధ కలిగి పనిచేయాలి. మనం నిబ్బరమైన బుద్ధి కలిగి మెళకువగా యుండాలి (1పేతురు 5:8). జ్ఞానులవలె యుండాలి. (ఎఫెసీ 5:15). ఈలోక మర్యాదననుసరించి నడువకూడదు (రోమా 12:2), సగం నిద్రపోతూ, మెళకువగా యుండలేకపోతే ఈలోకమును మనం జయించలేము. సోమరియైన చెడ్డ దాసులను క్రీస్తు అంగీకరించరు.

ప్రకటన గ్రంథములో చెప్పబడిన ఆసియాలోని ఏడు సంఘములకు వ్రాయబడిన ప్రతి లేఖలోను సంఘములో యున్న ప్రతి వ్యక్తి యొక్క బాధ్యత వక్కాణించబడింది. ఎఫెసులో యున్న సంఘములో "జయించువానికి దేవుని పరదైసులో ఉన్న జీవ వృక్షఫలములు భుజింపనిత్తును" అని చెప్పబడినది (ప్రకటన 2:7). సంఘముగా గాక, వ్యక్తిగతముగా మనకు తీర్పు తీర్చబడును. ప్రతి క్రైస్తవుడు తనకు తానే వినాలి, తానే జయించాలి. అతడు సహోదరుల నుండి, మిత్రుల నుండి సహాయము పొందవచ్చును గాని చివరకు అతడు వ్యక్తిగతముగా తనకు తానే దేవునికి బాధ్యుడై యున్నాడు. "దేవుడు పక్షపాతి కాడు", "మనలో ప్రతివాడు తన్ను గూర్చి లెక్క అప్పగించవలయును" (అపొ.కా. 10:34, రోమా 14:12).

జయించు వానికి చెప్పబడిన వాగ్దానములను ఇప్పుడు గమనించుము.

1. జీవవృక్ష ఫలములను భుజించే హక్కు (ప్రకటన 2:7).
2. నిత్యజీవ కిరీటము, రెండవ మరణము వలన ఏ హాని కలుగదు (ప్రకటన 2:10-11).
3. మరుగైన మన్నాను భుజింపచేయ బడుట, క్రొత్తపేరు ఇయ్యబడుట (ప్రకటన 2:17).
4. జనుల మీద అధికారము అనుగ్రహింపబడును (ప్రకటన 2:20).
5. తెల్లని వస్త్రములు ధరించుకొనును, జీవగ్రంథములో అతనిపేరుండును మరియు తండ్రియెదుటను, దూతల యెదుటను అతని గూర్చి ఒప్పు కొనబడును (ప్రకటన 3:5).
6. అతడు దేవుని ఆలయములో స్థంభముగా చేయబడును మరియు క్రొత్తపేరు అతనిమీద వ్రాయ బడును. (ప్రకటన 3:12).
7. జయించువాడు క్రీస్తుతోకూడ సింహాసనమందు కూర్చుండ బెట్ట బడును (ప్రకటన 3:21).

ఇవన్నీ ఎంత గొప్ప ఆశీర్వాదములు! జయించుటకు ఇయ్యబడిన బహుమానము లెన్నెన్నో గదా!

ఈ ఆశీర్వాదములన్నీ జయించు వానికే వాగ్దానము చేయబడెనని గమనించుము. అంటే మనం జయించకపోతే ఇవన్నీ కోల్పోవుదుము. మరియు దానిలో జయించే శక్తి ఓడిపోయే అవకాశము కూడ ఇమిడియున్నది. యిది సత్యము కాకపోతే ఈ మాటలు అర్ధరహితము. చెప్పబడిన ఆశీర్వాదముల లిస్టు ఇంకొకమారు పరికించుము, ఇన్ని ఆశీర్వాదములను పొందలేకపోతే ఎంత గొప్ప అపజయమో! గనుక మనందరం పెక్కు శ్రద్ధ కలిగి జీవించాలి.

-బిల్ బర్డన్

# ఇరుకు మార్గము

## ( The Narrow Way )

యేసు కొండ మీద నుండి చేసిన గొప్ప ప్రసంగములో ఇట్లు చెప్పారు. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి, నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలము నై యున్నది, దాని ద్వారా ప్రవేశించు వారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొను వారు కొందరే" (మత్తయి 7:13-14).

రెండు మార్గములను గూర్చి యేసు విశదముగా బోధించారు. విశాల మార్గము నాశనమునకును, ఇరుకుమార్గము జీవమునకును నడిపించును. నాశనమునకు పోవు విశాలమార్గములో అనేకులుందురు, గాని ఇరుకుమార్గములో పోవువారు కొందరే. ఆదారి సంకుచితమైనది అనగా ఇరుకైనది.

ఇరుకు మార్గములో పయనించాలంటే తన్ను తాను ఉపేక్షించుకోవాలి, వినయము కలిగి యుండాలి. ఈ మార్గము క్రీస్తులో యున్న జీవమునకు నడిపించును. "దేవుడు మనకు నిత్య జీవమును దయచేసెను. ఈజీవము ఆయన కుమారుని యందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు. దేవుని కుమారుని అంగీకరింపని వాడు జీవము లేనివాడే (1 యోహాను 5:11-12). మానవులు తమ్మును తావే ఉపేక్షించుకొని వినయముతో యేసును వెంబడిస్తే ఈ జీవమును పొందగలరు. "ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము" (ప్రకటన 22:17). "ప్రయాసపడి భారము మోసికొను చున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగ జేతును", అని యేసు పిలుచుచున్నారు (మత్తయి 16:24). ఇరుకు మార్గమున పయనించాలంటే ఒకడు ఎట్లుండాలో ఈ లేఖనములన్నీ మనకు తెలియజేయ చున్నాయి.

మనుష్యులు తగ్గించుకొనకపోతే తమ్మును తాము ఉపేక్షించుకొనక పోతే యేసు వారిని ఉపయోగించుకొనలేరు. గర్వానికి, అహంకారానికి ఇరుకు మార్గము చాల సంకుచితమైనది.

వాటికి అక్కడ తావులేదు. వినయ విధేయతలు గలవారు ఇరుకు మార్గములో పయనిస్తారు.

మతశాఖలకు కూడ ఇరుకు మార్గము చాలసంకుచితమైనది. ఈ ఇరుకు మార్గములో పయనించగల ఒక్క మతశాఖయైనను భూమిపై లేదు. మతశాఖలు మానవ కల్పితములు. అవి విభేదములు సృజించును. భేదములు, కలహములు, అసూయలు సృజించును (1 కొరింథీ 1:10; యోహాను 17:21). మతశాఖల బోధను చేయువాడైవడైనను ఇరుకు మార్గములో యుండలేదు. మేము ఇరుకు మార్గములో యున్నామని వారిలో కొందరనుకొంటారు, గాని వారు మోసగించబడ్డారు. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" (సామెతలు 14:12).

ప్రజలు డినామినేషన్లలో చేరి వారి ధనాన్ని, తలాంతులను ఆ సంస్థలకుపయోగిస్తే, వారు ఇరుకు మార్గమును ఎంచుకొన్న వారు కాదు. దేవుని వాక్యము మానవ కల్పిత మతశాఖలకు అనుమతి నియ్యలేదు. మానవ కల్పిత బోధలు, అబద్ధబోధకులు పయనించడానికి ఇరుకుమార్గము చాలా ఇరుకైనది.

క్రీస్తు సంఘము కంటే డినామినేషన్లు 'పెద్దవైనవని' కొందరు గొప్పలు చెప్పుకొంటారు. అయితే యిది సత్యము కాదు. జలప్రళయములో నాశనమైన వారు ఎంతో ఎక్కువమంది గాని ఓడలో యుండి రక్షించబడినవారు ఎనిమిది మందియే. అయితే దేవుని పక్షమున, సత్యము పక్షమున యుంటే అదియే గొప్పది. ఇరుకు మార్గమున నుండువారు కొందరె యని ప్రభువు చెప్పారు. జీవమునకు పోవుమార్గము లో మనము పయనించాలి. ప్రభువు నందు విశ్వసించాలి. మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందితే ఇరుకు మార్గములో ప్రవేశిస్తాము. "ఆయన వెలుగులో యున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తముప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7)

– జాన్ హేరిసన్

# ప్రభుత్వము యెడల క్రైస్తవుని బాధ్యత

## ( Christian's Responsibility to the Government )

క్రైస్తవుడు పాలకులకు లోబడి యుండవలెను. "అధిపతులకును అధికారులకును లోబడి విధేయులుగా ఉండవలెనని" తీతు 3:1లో వ్రాయబడి యున్నది. "ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను" అని రోమా 13:1 చెప్పుచున్నది. "మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడి యుండుడి" యని 1పేతురు 2:13 చెప్పుచున్నది.

ప్రభువు నిమిత్తమై పాలకులకు లోబడియుండాలి. "ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు" (రోమా 13:1). 'కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించు చున్నాడు' (రోమా 13:2). "రాజు అందరికిని అధిపతియనియు, నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకును సన్మార్గులకు మెప్పు కలుగుటకును రాజువలన పంపబడిన వారని వారికిలోబడియుండుడి. దేవునికి దాసులమని లోబడి యుండుడి" (1 పేతురు 2:14-16).

ప్రభుత్వము యొక్క ప్రతి నాగరిక చట్టమునకు లోబడియుండాలి. మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును లోబడియుండాలని పై వాక్యము చెప్పుచున్నది. ప్రతి కట్టడ అన్నపుడు భవన నిర్మాణచట్టములు, పన్నులు, శాంతిభద్రతలు మొదలగు విషయముల పై చట్టసభలు చేయు కట్టడలన్నీ యని అర్థము. అట్టి కొన్ని చట్టములు నహేతుకములు కావనియు, హాస్యాస్పదమైనవనియు మనము తలంచవచ్చును. గాని చట్టము, చట్టమే.

ఫలాన చట్టము నా కిష్టము లేదని దానికి నేను లోబడనియెడల ఇంకొకనికి మరొక చట్టము ఇష్టము కాకపోవచ్చును. అట్టి సందర్భములో అందరు అన్ని చట్టములకు అవిధేయత చూపుట సంభవించి గందరగోళము ఏర్పడును.

గనుక అన్ని దశలలోను ప్రభుత్వాధికారులకు మనము లోబడి యుండవలెను. రాజు అందరికి

అధిపతియనియు నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకు పంపబడిన వారనియు మనము గ్రహించవలెను. గనుక మన దేశము యొక్కయు, రాష్ట్రము యొక్కయు విధులకు మనము తప్పక లోబడి యుండాలి.

ప్రభుత్వశాసనములు దేవుని చిత్తానికి భిన్నముగా లేనంతవరకు ప్రభుత్వాధికారులకు అన్ని వేళలా మనము లోబడియుండాలి. బైబిలు బోధకే ఒకడు లోబడి యుండాలి. "మనుష్యులకు కాదు, దేవునికే మనము లోబడవలెను గదా" (అపొ.కా. 5:29). ఏదైనా ప్రభుత్వచట్టము మనకు ఇష్టము లేనందున దానికి అవిధేయులము కాకూడదు. ఆ చట్టము దేవుని చిత్తానికి వ్యతిరేకముగా లేనంతవరకు దానికి లోబడి యుండాలి. అక్కడ మన వ్యక్తిగత ఇష్టాయిష్టాలు పనికిరావు.

–రోజర్ కేంబెల్

## ఒకడు సర్వలోకమును సంపాదించుకొని...?

### ( What shall it profit if a man...?)

"ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము? మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఇయ్యగలడు?" (మార్కు 8:36) అని యేసుప్రభువు ప్రశ్నించారు.

1. ప్రతివాడు సంపాదించుకొనడానికి, లాభము పొందడానికి ఆసక్తి కలిగిన వాడే. దేనినైనా పోగొట్టుకొనుట మానవునికి ఇష్టముండదు. అనేకులు ఇహ సంబంధమైన లాభాలను పొందడానికి ఆసక్తి కలిగియుండుట చాలా విచారము. లాభనష్టాలను గూర్చియే ఎక్కువ సమయం ప్రజలు వెచ్చించుదురు. యిది ముఖ్యముగా ఆదోళనకరము.

ఎ. అనేక సంగతుల విలువ ఊగిసలాడును : బంగారము, భూమి మొదలగు వాటి విలువలు పెరుగుతాయి, తరుగుతాయి. స్థానికుల విషయం కూడ అంతే. డబ్బు సంగతి ఇక చెప్పనక్కర్లేదు. గాని ఒకని ఆత్మ యొక్క విలువ మాత్రం నిన్న, నేడు

నిరంతరము ఒకేలా ఉండును.

ఒకని ఆత్మను లేక ప్రాణాన్ని మనం కంటితో చూడలేనంత మాత్రమున దాని విలువ తగ్గిపోదు. "ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు, అదృశ్యమైనవి నిత్యములు" (2కొరింథీ 4:18). సంతోషము, దు:ఖము, బాధ, విద్యుచ్ఛక్తి మొదలైనవి అదృశ్యములు. గాని వాటి రుజువుల వలన దృశ్యముల వలె అవి వాస్తములు.

**2. ఈ ప్రశ్నను బట్టి ఒకడు తన ఆత్మను పోగొట్టుకొనగలడని రుజువగుచున్నది.** ఈలోకస్థులలో అనేకమంది యొక్క గతి అంతే (మత్తయి 7:13-14). ఆత్మను నశింప జేయుశక్తి పాపమున కున్నది (మత్తయి 8:34). ఒకని ఆత్మ నశించితే, అది ఆవ్యక్తి యొక్క స్వంత నిర్ణయమే దానికి కారణం (అపో.కా. 13:46).

మనుష్యుడు తన ఆత్మకు బదులుగా వేరొకదానిని కాంక్షించే ప్రమాదమున్నది : ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా యేమి ఇవ్వగలడు? అని యేసు ప్రశ్నించారు (మార్కు 8:37). ఇట్టి ప్రమాదమును గూర్చి యేసు తరుచు హెచ్చరించారు (మార్కు 10:28). తమ ప్రాణముకు ప్రతిగా మనుష్యులు ఇచ్చే కొన్ని సంగతులు దిగువ నీయబడినవి :

**1) అనుదినచర్యల కొరకు విపరీతమైన ఆసక్తి, తీరిక లేదు:** కొందరు జీవనోపాధి కొరకు తీరిక లేని పని చేస్తారు. గృహవ్యవహారాల్లో తీరిక లేక బైబిలు చదవరు, ఆరాధనకు వెళ్ళరు, దేవుని సేవచేయరు. వారు మార్తవలె విస్తారమైన పనులు పెట్టుకొంటారు. మరియ వలె కొందరు మాత్రమే ఉంటారు మరియం ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు" (లూకా 10:42). పరిశుద్ధునిగా యుండుటకు సమయము వెచ్చించు.

**2) దుష్ట సాంగత్యము:** సాంగత్యము యొక్క ప్రభావము నుండి మనము తొలగిపోలేము (1కొరింథీ 15:33). "పులిసిన పిండి కొంచమైనను ముద్దంతయు పులిజేయునని మీరెరుగరా?" (1కొరింథీ 5:6). నీవు మేకలతో సహవాసము చేస్తే వాటివలె కంపు కొట్టుట తధ్యము.

3) అబద్ధ బోధ : మానవుని ఆరాధన అబద్ధ బోధవలన వ్యర్థమగును (మత్త 15:9). యితర సువార్త ఏదయినను మనలను శాపముకు గురిచేయును (గలతీ 1:8,9). అబద్ధబోధలను ప్రోత్సాహించుటే అపవాది యొక్క రహస్య ఎజెండా.

4) పాపజీవితము (యోహాను 3:19). అల్పకాలముండు పాప భోగమును గూర్చి బైబిలు చెబుతుంది (హెబ్రీ 11:25). పాపభోగము అమితానందమే. గాని అది క్షణ భంగురమే. అనేకులు తాత్కాలిక భోగము కొరకు పాపములో పడుచున్నారు.

5) సుఖ జీవితము : దేవుని సేవ చేయాలంటే మనం కొంత వెచ్చించాలి. "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెను" అని యేసు చెప్పెను (మత్తయి 16:24). గాని అనేకులకు యిది ఇష్టముండదు. మనం గొప్ప సుఖయుగంలో జీవించుచున్నాము. కష్టపడి జీవించుట మరచిపోయాము.

మనుష్యుడు సమస్తాన్ని కలిగి యుండలేడు :

అతడొక దాన్ని సంపాదిస్తే ఇంకొక దాన్ని పోగొట్టుకొంటాడు. యిట్టి మార్పులనుండి తప్పించుకోలేము. ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా యేమి ఇయ్యగలడు? అని యేసు అడిగారు (మత్త 8:37). మనుష్యుడు ఇప్పుడు పాపములో జీవించి తదుపరి పరలోకమును పొందలేడు (కీర్తన 1:4,5). అతడు శరీరానుసారముగా విత్తి నిత్యజీవము కోయలేడు. "తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమనుపంట కోయును, ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్యజీవమును పంటకోయును" (గలతీ 6:8). పాపము కావాలంటే పరలోకమును త్యాగంచేయాలి. పరలోకం కావాలంటే పాపాన్ని త్యజించాలి. మనుష్యుడు ఈ రెండూ కలిగియుండలేడు.

జ్ఞానియైనవాడు తనకు కలిగినదంతయు అమ్మి పరలోకమును సంపాదించుకొనజూచును (మత్తయి 13:45,46).

మనుష్యుడు ఆత్మను పోగొట్టు కొంటే ఘోర నష్టము :

అంతకంటే తక్కువ దేది పోయినా నష్టమే. గాని ఒకడు ఈలోకమునంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమిప్రయోజనము? రుచిగల ఆహారపదార్థములను భుజించుటకు కావలసినంత ధనము కలిగియున్నను వాటిని తినుటకు ఆరోగ్యములేకపోతే యేమిప్రయోజనము? గొప్ప విలువైన కారును కొనుగోలుచేసి దానిలో ప్రయాణంచేయలేకపోతే యేమి ప్రయోజనము? గాని వీటన్నింటికంటే కావలసినంత ధనాన్ని సమకూర్చుకొని ఒకడు తన ఆత్మను పోగొట్టుకొంటే, అది అన్నిటి కన్నా ఘోరనష్టము.

ఆత్మ నాశనమయితే అది రెండు విధములైన నష్టము. తదనంతరము పరలోకము నష్టపోవుట (ప్రకటన 21:27). ఇప్పుడు ఇహలోకమందు అనేక ఆశీర్వాదములు నష్టపోవుట. తన ఆత్మను పోగొట్టుకొనినవాడు ఈలోకంలో అనేక ఆత్మీయాశీర్వాదము లను కోల్పోవును, గొప్ప సంతోషము కోల్పోవును (అపొ.కా. 8:39, కీర్తన 144:15), మనోహరమైన పలుకుబడి కోల్పోవును (ప్రకటన 14:13). క్రైస్తవుల సహవాసము కోల్పోవును (ఫిలిప్పీ 1:5) క్రీస్తువలె యుండే భాగ్యము కోల్పోవును (ఫిలి 1:21). యిట్టి నష్టములను పూడ్చగలిగేది యేదీ లేదు.

మనుష్యుని ఆత్మ యొక్క విలువ దేవుని ప్రేమలో కనబడుచున్నది (రోమా 5:8). క్రీస్తు దాని కొరకు చనిపోయారు (1కొరింథీ 15:3). ఆత్మ కొరకు యేసు పరలోకాన్ని సిద్ధపరచు చున్నారు (1 యోహాను 14:14).

ఆత్మ నిత్యముయుండునది, "భూమి మీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతి పనికాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2 కొరింథీ 5:1). "మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7).

ఈ భూమి పై నీ జీవితం అంతమయ్యేసరికి నీ ఆత్మ ఎక్కడికి పోవును ?

-లీరోయ్ బౌన్లో

# సంక్షిప్త వార్తలు

2017 మార్చి 9వ తేదీ గురువారం కృష్ణాజిల్లా, విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామములో సోదరులు గంటా ఫిలిప్పు గారి ఆధ్వర్యంలో నిర్వహించ బడుచున్న బైబిలు బోధనా విద్యా కేంద్రంలో తర్ఫీతుపొందిన 26 మంది బోధకులకు పట్ట ప్రధాన కార్యక్రమము ఘనముగా నిర్వహించబడెను. అమెరికా నుండి వచ్చిన కొందరు సోదరసోదరీలు, భారతీయ సహోదరులు పలువురు హాజరైరి. బైబిలు ట్రెనింగ్ పూర్తి చేసికొనిన బోధకులనుద్దేశించి సోదరులు రిక్కీగూటం, టి.జ్ఞానసుధీర్, పి.యస్.ఆర్.జయపాల్, వి.సహదేవుడు, జాన్‌డీన్, యం.సామ్యేలురాజు, సి.హెచ్.సద్గుణరావ్ గార్లు ఉపయుక్తమైన సలహాలను క్లుప్తప్రసంగ రీత్యా అందించిరి. గంటా ఫిలిప్‌గారు వందనసమర్పణ చేసిరి. హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటుచేయబడెను.

2017 మార్చి 16వ తేదీ ఉదయం రిక్కీ గూటం గారు వారి సతీమణి సుదీప గారు మరియు వారి కుమారుడు జస్టిన్ రోజర్, కుమార్తె జోయన్నరోజలిన్ గారు కలసి అమెరికా ప్రయాణమై వెళ్ళిరి. జోయన్నరోజలిన్ గారు తన 5వ నెలలోనే అమెరికాకు వెళ్ళడం ప్రశంసనీయం. దేవుని కృపవలన రిక్కీ గారి కుటుంబమంతయు 18వ తేదీ ఉదయానికి డల్లాస్ పట్టణం క్షేమముగా చేరుకొని, కొన్నిదినములు అక్కడ గడిపి ఓక్లహోమా చేరుకొనిరి. మార్చినెలాఖరు వారములో టెన్నిసీలో యున్న మెంఫిస్‌స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ లెక్చరర్‌షిప్‌కు హాజరవుటకు ఈ వార్తలు వ్రాయుసరికి వారు సిద్ధపడుచున్నారు. మరియు ఏప్రిల్‌లో అమెరికాలో జరుగు ఇండియా మిషనెరీ వర్క్‌షాప్‌కు ఆయన హాజరవుదురు. రిక్కీగూటం గారు, ఆయన కుటుంబము అమెరికాలో యున్నంత కాలము క్షేమముగా యుండునట్లు ప్రార్థించమనవి.

2017 మార్చి 24వ తేదీ శుక్రవారం విశాఖ వేలీ బైబిలు కాలేజీయొక్క 4వ పట్టణ ప్రధాన కార్యక్రమము ఘనముగా నిర్వహించబడినది. సోదరులు

జాన్‌డీన్ గారి సమర్ధవంతమైన నడిపింపుచొప్పున ఆ కార్యక్రమము అంతా ఘనముగా దేవునికి మహిమార్ధముగా జరిగినది. అక్కడ రెండు సంవత్సరములు బైబిలు విద్యాభ్యాసము చేసిన 12 మందికి సర్టిఫికెట్లు, మెడళ్లు, ఆధ్యాత్మిక పుస్తకములు ప్రదానముచేయబడినవి. సోదరులు జెర్రీబేట్స్ గారు అమెరికాలోని బేర్‌వేలీ బైబిల్ ఇనిస్టిట్యూట్ దరపున కోఆర్టినేటర్‌గా హాజరైరి. సోదరులు చుక్కా మాణిక్యరావ్, జాషువా గూటం తదితర్లు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు యమ్.సామ్యేలు రాజు గారు వందన సమర్పణ చేసిరి. తర్భీతు పొందిన 12 మందికి జెర్రీబేట్స్ గారి చేతులమీదుగా సైకిళ్ళు బహూకరించబడెను. యస్.అర్.కవితా గారి ప్రార్ధనతో, మంచి విందుతో ఆనాటి కార్యక్రమము ముగించబడెను.

2017 మే 10, 11, 12 తేదీలలో కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో రక్షణ సువార్త సభలు నిర్వహించబడును. వాటికి హాజరగుటకు అందరు సిద్ధపడి రావలసినదిగా మనవి చేయబడుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.